క్లుప్తంగా

దరఖాస్తులకు గడువు పెంపు

ఆసిఫాబాద్‌రూరల్/రెబ్బెన/సిర్పూర్(టి): సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు గడువును ఈనెల 16 వరకు పెంచినట్లు జిల్లా కేంద్రం లోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్, గురుకులాల డీసీవో బాలరాజు, రెబ్బెన టీడ బ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్ జ్యోతి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు.

సరుకులు అందజేత

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన టెలా శ్రీను వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అల్లూరి సాయి కుమార్ వారి ఇంటికి చేరుకొని ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ పదో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కుటుంబానికి 50 కిలోల బియ్యం, నూనె, ఇతర సామగ్రి అందజేశారు.

గ్రామాభివృద్ధికి కృషి

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఏఎంసీ చైర్మన్ మల్లేష్ అన్నారు. మంగళవారం మండలంలోని సాలేగూడ గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామసభకు సర్పంచ్ వినోద్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ పిల్లలకు పలకలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం

బెజ్జూర్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం అందజేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణ అన్నారు. మంగళవారం మండలంలోని ఎలుకపెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె హాజరై చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీరోజు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులతో పాటు చిన్నారులకు పోషకాహారం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, అంగన్‌వాడీ టీచర్లు తిరుపతమ్మ, స్వప్న, దుర్గా, లలిత, రామాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



బియ్యం పంపిణీ చేస్తున్న సీఐ నాగరాజు, ఎస్సై జగదీశ్

కాగజ్‌నగర్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు అన్నారు. మంగళవారం రాత్రి మండవ గ్రామంలో నిరుపేదలకు బియ్యం పంపిణీ చేశారు. 19 పేద కుటుంబాలకు మూడు క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేయడంతో పాటు యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈజ్‌గాం ఎస్సై జగదీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం	: పులి

కాగజ్‌నగర్

వెంకటరమణ	: పులి

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	40
చామగడ్డ	80
వంకాయ	30
బీరకాయ	60
కాకరకాయ	50
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజి	40

-ఆసిఫాబాద్‌అర్బన్

పాఠశాల ప్రాంగణం.. టేకు వనం

- మోడి ఆశ్రమంలో 330 టేకు వృక్షాలు
- సంరక్షిస్తున్న విద్యార్థినులు, సిబ్బంది



మోడి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలోని టేకు వనం

కెరమెరి: విశాలమైన పాఠశాల ప్రాంగణంలో టేకు వనం విద్యార్థులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కలిగిన మండలంలోని మోడి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో హరితహారంలో భాగంగా పెద్ద ఎత్తున నాటిన మొక్కలను సంరక్షిస్తూ విద్యార్థులు ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 542 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. చదువుతోపాటు ఇతర కార్యక్రమాల్లోనూ విద్యార్థులు ముందంజలో ఉండేలా ఇక్కడి టీచర్లు బోధిస్తున్నారు.

330 వరకు చెట్లు..

పాఠశాలల్లో కూరగాయలు, పూలు, పండ్ల వనాలు పెంచడం సాధారణంగా చూస్తుంటాం. కాని మోడి బాలికల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు టేకు చెట్లు పెంచుతున్నారు. 2013 -14లో హరితహారంలో భాగంగా పాఠశాలలో 500 టేకు మొక్కలు నాటారు. కాగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది మొక్కలను పెంచి పెద్ద చేసే బాధ్యతలను తీసుకున్నారు. దీంతో నాటిన మొక్కల్లో దాదాపు 330 టేకు మొక్కలు ప్రస్తుతం చెట్లుగా మారాయి. విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల కృషి ఫలితంగా పాఠశాల ప్రాంగణంలో పెద్ద టేకు వనం తయారైంది. కొన్నేళ్ల తర్వాత ఈ చెట్లను విక్రయిస్తే పాఠశాలకు రూ.లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

శ్రద్ధగా పెంచుతున్నాం



టేకు మొక్కలను చాలా శ్రద్ధగా పెంచుతున్నాం. ఆకులు రాలిపోతే శుభ్రపరుస్తున్నాం. టేకు వృక్షాలతో పాఠశాల చూపరులను ఆకర్శిస్తోంది. టేకు మొక్కల పెంపకంలో విద్యార్థినుల కృషి ఎంతో ఉంది.

- ప్రేంసింగ్, హెచ్‌ఎం, మోడి

ఎంతో ఉపయోగకరం



మా పాఠశాల ప్రాంగణంలో ఉన్న టేకు వనం చాలా ఉపయోగకరంగా ఉంది. పెరిగిన చెట్లు నీడనిస్తున్నాయి. సాయంత్రం చెట్ల కిందే చదువుకుంటున్నాం. వాటిని పెంచడానికి ఎంతో కృషి చేశాం.

- జంగుబాయి, 10వ తరగతి

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

దహెగాం: ఇంటర్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలో చదువుతున్న 137 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్ మంగళవారం తెలిపారు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు..

మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రానికి విద్యార్థులు ఇతర గ్రామాల నుంచి చేరుకోవడానికి ప్రైవేట్ వాహనాలే దిక్కుగా మారుతున్నాయి. ఉదయం పది గంటలకు పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆ సమయంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆటోలలో ప్రయాణం చేయాల్సి వస్తుందని, అధికారులు విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సర్వీసులు ఏర్పాటు చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ రాజయ్య మంగళవారం తెలిపారు. పరీక్షలు ఏప్రిల్ 1వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 209 మంది, ద్వితీయ సంవత్సరంలో 199 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. సీఎస్‌గా దుర్గం జ్ఞానేశ్వర్, డీవోగా తస్లీమాను నియమించినట్లు పేర్కొన్నారు.



తిర్యాణి: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రెబ్బెనలో..

రెబ్బెన: రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ పాడిగి ప్రకాష్, డీవో లక్ష్మణ్‌లు తెలిపారు. రెబ్బెన పరీక్ష కేంద్రంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 510 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 362 మంది హాజరు కానునున్నట్లు తెలిపారు.

తిర్యాణిలో..

తిర్యాణి: నేటి నుంచి నిర్వహించే ఇంటర్మీడియెట్ పరీక్షలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 250మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 197 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

కౌటాలలో..

కౌటాల: ఇంటర్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప తెలిపారు. కౌటాలలోని జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో వేసిన హాల్‌టికెట్ నంబర్లను ఆమె మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరంలో 398 మంది, ద్వితీయ సంవత్సరంలో 361 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.



కౌటాల: హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు



రెబ్బెనలో..



బెజ్జూర్: ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

క్షయ రహిత సమాజం కోసం పాటుపడాలి

బెజ్జూర్: క్షయ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని జెడ్పీటీసీ పుష్పలత అన్నారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి ఎడతెరపిలేని దగ్గు, సాయంత్రం పూట జ్వరం రావడం, ఆకలి తగ్గటం, ఛాతినొప్పి, బరువు తగ్గటం, తెమడలో రక్తం పడడం వంటి లక్షణాలు ఉన్నవారు ఆస్పత్రిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, డాక్టర్ సుంకన్న, హెచ్‌వీ రేణుక, ఎల్‌టీ దిలీప్, కార్యదర్శి తుకారాం, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

కౌటాలలో..

కౌటాల: క్షయ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మంగళవారం మండలంలోని గుండాయిపేట గ్రామంలో అవగాహన ర్యాలీ తీశారు. టీబీ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా చేపల మృతి



మృత్యువాత పడిన చేపలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోసిని గ్రామపంచాయతీ పరిధిలో గల చేపల చెరువులో చేపలు మంగళవారం అనుమానాస్పదంగా మృత్యువాత పడ్డాయి. చెరువులో చేపలన్నీ తేలుతుండటంతో కొంతమంది రైతులు గమనించి చేపల చెరువు యజమాని రావి మురళీకి సమాచారం అందించారు. అనంతరం రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సోనియాలకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నీటి శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్.. నీళ్లు లేక నిరుపయోగం



కౌటాల: కౌటాల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన మూత్రశాలలు నిరుపయోగంగా మారాయి. మూత్రశాలలకు నీటి సరఫరా లేకపోవడంతో వినియోగంలోకి రావడం లేదు. ప్రయాణికులు ఆరుబయటే మూత్ర విసర్జన చేస్తుండడంతో బస్టాండ్ ప్రాంగణం దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

సంబంధిత అధికారి : శ్రీధర్, డీఎం, ఆసిఫాబాద్
ఫోన్ నంబర్: 9959226006

భక్తిశ్రద్ధలతో హనుమాన్ మాలధారణ



మాలధారణలో పాల్గొన్న భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: హనుమాన్ జయంతి పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో 150 మంది భక్తులు 21రోజుల పాటు అర్ధ మండల దీక్షను స్వీకరించారు. అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాన్ని నిర్వహించి, భక్తులకు మాలధారణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పిన్నా వివేక్, మురళీగౌడ్, మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

- 'డబుల్' ఇళ్ల కేటాయింపుపై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో అక్రమాలు చోటు చేసుకున్నాయని, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు రావి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పలువురు బాధితులతో కలిసి అదనపు కలెక్టర్ రాజేశంకు వినతిపత్రం సమర్పించారు. అక్రమాలపై విచారణ చేపట్టి అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలన్నారు. ఆయన వెంట నాయకులు శ్యాం, యూసుఫ్, సద్దాం ఉన్నారు.

పారదర్శకంగా నిర్వహించలేదు..

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయని, పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించలేదని పలు వార్డులకు చెందిన ప్రజలు ఆరోపించారు. కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసేందుకు మంగళవారం కాగజ్‌నగర్ నుంచి ఆసిఫాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. సమగ్ర విచారణ జరిపించి ఇల్లు లేని నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల కేటాయింపులో కొందరు ప్రజాప్రతినిధులు అధికారులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ విషయంలో తాము సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశామని, కలెక్టర్‌ను సైతం కలిసి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు.

సమాజ సేవలో ముందుండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాకర్

సిర్పూర్(టి): నిత్యం రహదారులపై ప్రయాణించే డ్రైవర్లు సమాజ సేవలో ముందుండాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆటోలు, ఫోర్‌వీలర్ వాహనాల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ మహిళా ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. వాహనాన్ని అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించినా.. మద్యం తాగి నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సురక్షిత ప్రయాణాలు సాగిస్తున్న ముగ్గురు డ్రైవర్లను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సై దీకొండ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

'పంచాయతీ కార్మికులతో చాకిరీ చేయిస్తున్న ప్రభుత్వం'

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా, వెట్టిచాకిరీ చేయిస్తోందని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెరిక శ్రీకాంత్ అన్నారు. మంగళవారం రెబ్బెన పంచాయతీ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్మికుల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శంకర్, దుర్గ ప్రసాద్, రమేష్, దేవాజీ, రాజమ్మ, లక్ష్మి, రాజేశ్వరి, నర్సయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రామారావు

దహెగాం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన విజయకు రూ.18 వేలు, చినగుడిపేట గ్రామానికి చెందిన మనీషాకు రూ.26వేలు, వీరయ్యకు రూ.26వేలు, పంబాపూర్ చంద్రయ్యకు రూ.46 వేలు, కల్వాడ మల్లేష్‌కు రూ.60 వేలు, చినగుడిపేట మల్లక్కకు రూ. 24వేలు, కుంచవెల్లి శ్రీనివాస్‌కు రూ.60 వేలు, ఒడ్డుగూడ గ్రామానికి చెందిన మంగమ్మకు రూ.27 వేలు, మొట్లగూడ సుగుణాకర్‌కు రూ.14 వేలు చినగుడిపేట సురేష్‌గౌడ్‌కు రూ. 30వేల చొప్పున చెక్కులు అందజేశారు. మండల రైతుబంధు సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్, సర్పంచ్ బండ క్రిష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎటుకూరి శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని రాస్పెల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడావి హన్మంతు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రత్యేక శ్రద్ధ కనబర్చి పాఠశాలలో మౌలిక వసతులు సమకూర్చారన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మెళ్ల పద్మ కిషన్, పీఆర్‌టీయూ నాయకులు భిక్షపతి, ఉపాధ్యాయులు రాకేశ్, ప్రకాశ్, దివ్య, గాయత్రి, రవికుమార్, మహిపాల్, చంద్రశేఖర్, ఎస్‌ఎంసీ చైర్మన్ రవి, మాజీ సర్పంచ్ లింగయ్య, గణేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లవాడ కాలనీలో ఎన్‌ఆర్ ఈజీఎస్ రూ.20లక్షల నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను మంగళవారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, వార్డు సభ్యులు విజయ, ఇఫాత్‌హుస్సేన్, కారం నాని, అబ్దుల్ అఖిల్, దుర్గం జయంత్, అబ్దుల్ ఆమెర్, స్థానికులు పాల్గొన్నారు.

పరామర్శ..

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన నేరెళ్ల వెంకటేష్, గోవింద్‌పూర్ కాలనీకి చెందిన ఒడ్డెటి తిరుపతిలు మృతి చెందగా మృతదేహాలకు నివాళులు అర్పించి కోనేరు కృష్ణారావు సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. ఆయన వెంట మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, నాయకులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

వాంకిడి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో వెంకటేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలోని శాటిలైట్ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ సిడాం అన్నిగా తదితరులు ఉన్నారు.